## ఏసీబీ వలలో అటవీ శాఖ పెద్ద తలలు

### - చిక్కిన ఎఫ్‌డిఓ, డిఆర్ఓ



**టి మీడియా, మే7 ,భద్రాచలం :** ఒక రోడ్డు వేస్తుండగా కొన్ని చెట్లు కట్ కావడం తో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి ఓ సుజాత రూ పది లక్షలు డిమాండ్ చేసి గురువారం రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డి ఆర్ ఓ కృష్ణయ్య ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రోడ్డు వేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బ తిన్నాయి ఈ ఎపిసోడ్ లో ఎఫ్ డి ఓ సుజాత పది లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయం లో 3.5 లక్షలు లంచం తీసుకుంటు డి ఆర్ ఓ తో పాటు పట్టుబడ్డారు.గతం లో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. అటవీ శాఖ లో అవినీతి పేరుకుపోయింది.


Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 116
సంచిక : 236
పేజీలు : 4
శుక్రవారం, మే 08, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN




# రాజకీయ వేడి

## ఖమ్మం కార్పొరేషన్‌లోఎన్నికలపై చర్చలు..

### -పార్టీల్లో కసరత్తు ప్రారంభం

**టి మీడియా, మే7 , ఖమ్మం :**నగర రాజకీయాల్లో మరోసారి ఎన్నికల సందడి కనిపిస్తోంది. ఐదేళ్లుగా కొనసాగిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం ముగి సిన నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో చురుకుదనం పెరిగింది. 2021లో ఏర్పడిన పాలకవర్గం గడువు మే 7తో పూర్తికావడంతో ఇకపై ప్రత్యేక అధికారి పాలన కొనసాగనుండగా, తదుపరి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది.2021 కార్పొరేషన్ ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. సీపీఐ మద్దతుతో బీఆర్ఎస్ 43 డివిజన్లలో గెలిచి మేయర్ పీఠాన్ని దక్కించుకుంది.

4లో...



# అర్హులకు ప్రభుత్వ పథకాలు

### -జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టి మీడియా, మే7 ,ఖమ్మం** :2 బిహెచ్‌కే గృహాలు, ప్రజా దర్బార్ వినతులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి 2బిహెచ్‌కే గృహాలు, ప్రజా దర్బార్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొదటి 7 క్లస్టర్లలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులలో 78 దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అందలేదని, తదుపరి సమావేశం నాటికి వాటి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.7 క్లస్టర్లలోని ఎల్-3 దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, అర్హులుగా గుర్తించిన వారిని ఎల్-1 కేటగిరీకి మార్చాలని సూచించారు. ఎల్-3 వెరిఫికేషన్‌ను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, ఒకే ఇంట్లో బహుళ కుటుంబాలు నివసిస్తూ బీపీఎల్ అర్హత కలిగి ఉంటే కొత్త ఇళ్ల మంజూరుకు అర్హులుగా పరిగణించాలని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాలో మొత్తం 6,107డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తయ్యాయని, 655 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, 467 ఇళ్లు ప్రారంభం కాలేదని తెలిపారు. ప్రారంభం కాని ఇళ్లను రద్దు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి 6,094 మందికి ఇళ్లను అప్పగించినట్లు వెల్లడించారు.భూమిలేని పేద లబ్ధిదారులకు నిర్మాణంలో ఉన్న 655 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై ఎంత మొత్తం మంజూరైందో, ఇప్పటి వరకు ఎంత వ్యయం జరిగిందో, జీ ప్లస్ వన్ తరహా ఇళ్లు ఎన్ని ఉన్నాయో, వ్యక్తిగత ఇళ్లు ఎన్ని నిర్మాణంలో ఉన్నాయో సమగ్ర నివేదిక తయారు చేసి సమర్పించాలని



అధికారులను ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న వ్యక్తిగత ఇళ్లను నేరుగా లబ్ధిదారులకు అప్పగిస్తే, వారు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద మిగిలిన నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. జీ ప్లస్ వన్ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యిందా లేదా అన్న వివరాలు కూడా నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ శ్రీనివాస్, ఈడీఎం దుర్గాప్రసాద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జాహేదా, సీఎల్‌టీసీ బి. లావణ్య, కె. రాహుల్, డీఈ జాగారం, ఏఈలు స్నేహ, యాకేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.






## విశ్రాంత సూ పరిండెంటెంట్ సంజీవ రావు మృతి

**నివాళులు అర్పించిన గుండాల కృష్ణ**

**టీ.మీడియా,మే7,ఖమ్మం** :సిద్దారెడ్డి కళాశాల సూ పరిండెంటెంట్ సంజీవ రావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎస్.బి. ఐ.టి.,ఆర్జేసి విద్యాసంస్థ ల ఛైర్మన్ గుండాల కృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తనకు అప్పగించిన పనిని నిబద్ధత తో పూర్తి చేసే వ్యక్తి సంజీవ రావు అని కొనియాడారు.ఆయన పదవీ విరమణ తర్వాత తమ ఎస్.బి. ఐ.టి.లో కూడా సూపరిండెంటెంట్ గా పనిచేశారని గుర్తు చేసుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## జనాభా గణనకు సహకరించండి

**తాసిల్దార్ సయ్యద్ హుస్సేన్..**



**టీ.మీడియా,మే7,చింతూరు**:జనాభా గణనకు సహకరించి దేశాభివృద్ధికి తోడ్పడాలని చింతూరు తహసిల్దార్ సయ్యద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారుభారత ప్రభుత్వం వ్యాప్తంగా దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనాభా గణన లో భాగంగా మొదటి విడత ఇండ్ల జాబితా తయారీ మే 1 నుండి మే 30 వరకు నిర్వహించబడుతోంది.ఈ సర్వే లో భాగంగా ప్రజలు ఇంటి యొక్క స్థితిగతుల వివరాల నమోదు జరుగును. తమ ఇంటికి వచ్చే గణన అధికారులకు మీ కుటుంబ వివరాలు ఖచ్చితంగా తెలియ చేయాలన్నారు. అందించే సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమన్నారు . జనాభా గణనలో అందించే వివరాల వల్ల కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు .మొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న ఈ జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . వివరాలు – దేశ ప్రగతికి మెట్టు, కావున ప్రభుత్వ అధికారులకు సహకరించాలని , వివరాలు ఇవ్వడం వల్ల దేశాభివృద్ధికి తోడ్పడి నట్లవుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు.



## తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు

**-వాతావరణ శాఖ వెల్లడి**

**టి మీడియా, మే7, ఖమ్మం:** జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారే అవకాశముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు-మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈ మేరకు రెండు జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మే 7, 8 తేదీల్లో తెలంగాణలో పలుచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు తీవ్రంగా ఉండవచ్చని హెచ్చరించింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, ఇప్పుడు వర్షాల ప్రభావంతో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద నిలబడకుండా ఉండాలని, పిడుగుల సమయంలో బయట తిరగవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, బలహీన నిర్మాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**- ఎంపీ రఘురాం రెడ్డి విస్తృత పర్యటన**

**టీ.మీడియా,మే7,మధిర:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గురువారం ఆయన మధిర మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రూ.52లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు కేటాయించే నిధుల్లో అత్యధిక భాగాన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మధిర మండలంలో పర్యటించి వంగవీడులో రూ.5 లక్షలు, నిధనపురంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించగా, సిరిపురంలో రూ.5 లక్షలు మరియు రాయపట్నంలో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు మొత్తం 12 ప్రాంతాల్లో సుమారు రూ. 52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పల్లెల్లో ప్రగతి పరుగులకు బాటలు వేశారు. అనంతరం వంగవీడు గ్రామంలో ఇటీవల నీటిలో మునిగి చనిపోయిన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, రాజూ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, దేవిశెట్టి రంగారావు, టి ఏ సి మెంబర్ ఉమ్మినేని



కృష్ణ, అమరవాది సత్యనారాయణరెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, ఎర్రగుంట రమేష్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, అద్దంకి రవికుమార్, గొల్ల ఉద్ధండయ్య, దుంప వెంకటేశ్వర్ రెడ్డి, ఐలూరి జనార్దన్ రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి బాలకృష్ణ, ఆయా గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదల, క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చు

**టీ.మీడియా,మే7, కొత్తగూడెం**

పట్టుదల, క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చునని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం అభినందించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో మొత్తం 63 మంది మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లి, దండ్రులు కష్టాన్ని గుర్తించాలని పిల్లలకు సూచించారు. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మ స్థైర్యం ఉంటే ఎలాంటి కష్టమైన లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చన్నారు. జీవితంలో ఎల్లప్పుడూ పాఠాలను నేర్చుకుంటూనే ఉండాలని, ప్రతి రోజు



ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు. మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొని, దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. పోలీస్ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎస్పీ తన బాల్యం నుండి ఐపిఎస్ సాధించే వరకు జరిగిన గత స్మృతులను వారితో పంచుకున్నారు. అనంతరం మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, చుంచుపల్లి సిఐ రాయల వెంకటేశ్వర్లు,1టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంటిఓ సుధాకర్, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం



**-15న కలెక్టరేట్ వద్ద ధర్నా**

**టీ మీడియా ,మే 7 ,కొణిజర్ల**:కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని, ఈ పథకాన్ని కాపాడుకోవడానికి కూలీలందరూ ఐక్యం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం, పెద్ద రాంపురం, గుబ్బగుర్తి, అంజనాపురం, గద్దలగూడెం తదితర గ్రామాల్లో వారు పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఉపాధి హామీ కూలీల భారీ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ పేరు మార్చి 'జివిరాంజీ' పథకంగా మార్చాలని కేంద్రం చూస్తోందని, ఇది పథకాన్ని నిర్వీర్యం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని దినాల సంఖ్యను పెంచడంతో పాటు, రోజువారీ వేతనాన్ని రూ. 600లకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని కూలీలందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి 15వ తేదీ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యకాస సీనియర్ నాయకులు పుల్లూరి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చింతపల్లి ప్రసాద్, బాణోత్ హరిచంద్, తేజావత్ సీతారాములు, చల్లా వెంకటనారాయణ, జంగిలి లక్ష్మయ్య మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.




# ఉద్యోగం పేరుతో మోసం..

**-మధిరలో కేసు నమోదు**

**టి మీడియా, మే7 ,మధిర:**ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో ఆన్‌లైన్ మోసం ఘటన వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.బాధితుడి వివరాల ప్రకారం, సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తి ప్రైవేట్ కంపెనీలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఉద్యోగ నియామక ప్రక్రియ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రైనింగ్ పేర్లతో విడతల వారీగా డబ్బులు పంపించాలని కోరాడు. నమ్మిన బాధితుడు ఆన్‌లైన్ ద్వారా పలుమార్లు నగదు బదిలీ చేశాడు.అయితే డబ్బులు తీసుకున్న తర్వాత ఉద్యోగం ఇవ్వకుండా నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో మోసపోయినట్లు బాధితుడు గుర్తించాడు. దీంతో స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఐటీ చట్టం మరియు మోసం కేసుల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్లు, ఆన్‌లైన్ లావాదేవీల ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.ఉద్యోగాల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ప్రకటనలు, తెలియని లింకులు నమ్మి డబ్బులు పంపొద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.




## భార్యను హతమార్చిన భర్త

**టీ మీడియా, మే 7, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో భార్యను హతమార్చిన సంఘటన వైరా మండల పరిధిలో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం, దంపతుల మధ్య గత కొంతకాలంగా కుటుంబ వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, ఆగ్రహానికి లోనైన భర్త భార్యపై దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వైరా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

## సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**



**టీ మీడియా, మే 7, ఖమ్మం:**జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మే 13 నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష ప్రశ్నపత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి సంవత్సరం 10,344 మంది, ద్వితీయ సంవత్సరం 3562 మంది మొత్తం 13906 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఐఈఓ కె. రవిబాబు, డిఈసి సభ్యులు ఎం సింహాచలం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, పాల్గొన్నారు.

# పంటలు కొనకుండా పండుగలేల..?




**-కళ్ళాల్లోనే ధాన్యం కుప్పలు**

**ప్రభుత్వం స్పందించాలంటూన్న "బొంతు"**

**టీ మీడియా,మే7, తల్లాడ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో తెల్లారితే ఏ సమస్య వస్తుందో అని ప్రజలు సమస్యలతో తలడిల్లుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో పండుగలు చేసుకోటం సిగ్గుచేటుగా ఉందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఒకవైపు రైతులు కోతలు పూర్తయి పండించిన ధాన్యం కళ్ళల్లో కుప్పలుగా ఉండగా,రోజుకొకచోట అకాల వర్షం కురుస్తూ కంటికి కునుకు లేకుండా చేస్తుంటే రైతు కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వం వారోత్సవాలు పేరిట ఉత్సవాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంలో జిల్లాకు చెందిన వారి ముగ్గురు మంత్రులుగా ఉండటం జిల్లా ప్రజలకు లాభమా? శాపమా? అర్థం కాని పరిస్థితి జిల్లా ప్రజలకు నెలకొందని ఆయన యద్దేవా చేశారు.క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పంటల కొనుగోళ్లలో సర్కార్ ఆలస్యం రైతులకు శాపంగా మారిందన్నారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చోట కొనుగోళ్లు మొదలు పెట్టకపోవడం,మొదలుపెట్టిన చోట కొర్రీలు,కోతలతో జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 20 రోజుల నుంచి నెలరోజుల పాటు కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని,తామంతా రోడ్లపై అరిగోస పడుతుంటే..ఇదే సమయంలో పండుగలెలా చేస్తారు? అంటూ రైతులు మండిపడుతున్నారు.పంటలు కొనడం చేతగావడంలేదు గానీ.. పండుగలు చేయడానికి ఉత్సాహం చూపుతారా? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అన్నింటా నష్టాలు చవిచూస్తున్న రైతులు కష్టాలు,కన్నీళ్లతోనే ఉత్సవాల్లో పాల్గొనలా?అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య మండల నాయకులు కట్టా దుర్గారావు, ఐలూరి రామిరెడ్డి,కట్టా కృష్ణారావు,దూల పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.



## రైతువేదికలో రైతు వారోత్సవాలు

**టీ మీడియా, మే 7, మధిర:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మధిర రైతువేదికలో రైతు వారోత్సవాల నాలుగో రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు -- పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ యాంత్రికరణపై అవగాహన సదస్సుతో పాటు వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ డి. పుల్లయ్య మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న మేలైన సన్నరకం వరి విత్తనాలను రైతులు సాగు చేయాలని సూచించారు. గ్లైఫోసేట్‌ను తట్టుకునే పత్తి విత్తనాలను ఉపయోగించవద్దని, వాటి వల్ల భూమి , పర్యావరణానికి నష్టం కలుగుతుందని హెచ్చరించారు. తొలకరి వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు నాటాలని, ముందుగానే విత్తనాలు వేస్తే మొలక శాతం తగ్గే అవకాశముందని తెలిపారు.అలాగే ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలిపి సేంద్రియ పదార్థంగా వినియోగించుకోవాలని, ఇందుకోసమే ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ బండా నర్సింహారావు మాట్లాడుతూ ఈసారి మొక్కజొన్న సాగు అధికంగా జరిగిందని, రైతులకు ఇబ్బందులు లేకుండా వారం రోజుల్లో గోదాములు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతులకు పూర్తి సహకారం అందిస్తోందన్నారు.విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయ అవసరాలకు సౌరశక్తి వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. బీడు భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులను విద్యుత్ ఉత్పత్తిదారులుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ రైతులకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఏఆర్ఎస్ శాస్త్రవేత్త నాగస్వాతి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి పాటించాలని, అధికంగా రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ఆత్మ డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**టీ మీడియా, మే 7, ముదిగొండ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్లో ముదిగొండకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు.ఈ సందర్భంగా ముదిగొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతగాని నాగరాజు తన కుమార్తెల ఓణీల శుభకార్యానికి విచ్చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎంకు ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ శుభకార్యానికి హాజరవుతానని హామీ ఇచ్చారు.ఈ భేటీలో మధిర నియోజకవర్గ కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు కందిమళ్ల వీరబాబు, ముదిగొండ మండల ఎస్సీఎస్సీఎల్ అధ్యక్షుడు చెరుకుపల్లి రాంబాబు, మండల నాయకుడు నాయిని వీరనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతగాని నాగరాజు పాల్గొన్నారు.అలాగే నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు తదితర అంశాలపై నాయకులు డిప్యూటీ సీఎంతో చర్చించినట్లు తెలిపారు.



## మార్కెట్ యార్డుల్లో మొక్కజొన్న రద్దీ

**-మద్దతు ధర కల్పించాలని రైతుల డిమాండ్**

**-కొనుగోలు ఆలస్యంపై ఆందోళన**

**టి మీడియా, మే7 ,ఖమ్మం:** జిల్లాలో మొక్కజొన్న కోతలు వేగంగా పూర్తవుతున్న నేపథ్యంలో మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు భారీగా వాహనాలు చేరుతున్నాయి. ఖమ్మం, వైరా, మధిర, ఎంకూరు, బోనకల్, చింతకాని ప్రాంతాల నుంచి వందలాది ట్రాక్టర్లు, లారీల్లో రైతులు మొక్కజొన్నను మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో యార్డుల వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగడం, సరైన గోదాములు లేకపోవడం వల్ల రైతులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి మంచి స్థాయిలో వచ్చినప్పటికీ ధరలు మాత్రం రైతులను తీవ్రంగా నిరాశపరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ఉండగా, మార్కెట్‌లో మాత్రం రూ.1,600 నుంచి రూ.1,800 మధ్యే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి క్వింటాకు రూ.600 నుంచి రూ.800 వరకు నష్టం వస్తోందని చెబుతున్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తగినంతగా జరగలేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాల్లో సాగు జరిగినప్పటికీ అవసరమైన స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని పేర్కొంటున్నాయి. కొన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైనా, గన్నీ బ్యాగులు, రవాణా వాహనాల కొరతతో ప్రక్రియ మందగించిందని రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మధిర నియోజకవర్గంలోని చింతకాని పిఏసి ఎస్ కార్యాలయం వద్ద రైతులు నిరసనకు దిగారు. మొక్కజొన్న బస్తాలు రోజుల తరబడి నిల్వ ఉండిపోవడం, లారీలకు ట్రక్ షీట్లు ఇవ్వడంలో ఆలస్యం జరగడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు రైతులు పిఏసి ఎస్ సీఈఓను కార్యాలయంలోనే నిర్బంధించి ఆందోళన చేపట్టారు. మరోవైపు తిరుమలాయపాలెం మండలంలో రైతులు రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వర్ సమస్యల కారణంగా కూడా కొనుగోలు ప్రక్రియ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. డేటా నమోదు, ట్రక్ షీట్ జారీ వంటి పనులు నిలిచిపోవడంతో లారీల్లో లోడ్ చేసిన మొక్కజొన్న రోజులు తరబడి యార్డుల్లోనే ఉండిపోతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందనే భయం కూడా రైతుల్లో కనిపిస్తోంది.ఇక రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు నష్టం కలగకుండా ఎం ఎస్ పి వద్దే కొనుగోలు చేస్తున్నామని చెబుతోంది. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా 278 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ధరల మద్దతు పథకంలో మొక్కజొన్నను చేర్చకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు కొనసాగిస్తోందని చెప్పారు. అయితే ఖమ్మం రైతులు మాత్రం "పంటను వెంటనే కొనుగోలు చేసి పూర్తి స్థాయిలో మద్దతు ధర ఇవ్వాలి.. ఎకరాకు పరిమితి విధించకుండా ప్రతి గింజ కొనాలి" అని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మార్కెట్ యార్డుల్లో ఇంకా భారీగా వాహనాలు చేరుతుండటంతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత రద్దీగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



## గ్యాస్ గోడౌన్ లో ఉన్నా తప్పని తిప్పలు....

### సిపిఎం ఆందోళన

**టీ మీడియా .మే 7 కామేపల్లి:** మండల కేంద్రంలో గ్యాస్ గోడౌన్ లో ఉన్నప్పటికీ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మాజీ మండల కార్యదర్శి బాదవత్ శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం తాళ్లగూడెం లోని తిరుమల  గ్యాస్ ఏజెన్సీ వద్ద నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.హామీల అమలులో వైఫల్యం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు దాటినా ఉచిత గ్యాస్ హామీని నెరవేర్చలేదు.అధికారుల నిర్లక్ష్యం, వల్ల ప్రజలు గ్యాస్ కోసం 'హరి గోస' పడుతున్నా తహసీల్దార్, ఇతర అధికారులు పట్టించుకోకుండా బుద్ధ విగ్రహాల్లా వ్యవహరిస్తున్నారు.ఏజెన్సీల తీరు గ్యాస్ ఏజెన్సీలు నిబంధనల ప్రకారం గ్రామాలకు వెళ్లి సరఫరా చేయకుండా వినియోగదారులను గోడౌన్ల చుట్టూ తిప్పుకుంటున్నాయి.గ్యాస్ పంపిణీని వెంటనే క్రమబద్ధీకరించకపోతే ప్రజలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలు చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు , బాధితులు పాల్గొన్నారు.



## పంటల అవశేషాలు కాల్చొద్దు

### రూరల్ సీఐ డీ. మధు

**టీ మీడియా, మే 7, మధిర:**రైతులు పంటల అవశేషాలను కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించి పంటలు, విద్యుత్ లైన్లు, పశువులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని, అగ్ని ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని మధిర రూరల్ సీఐ డీ. మధు రైతులను కోరారు.గురువారం తన కార్యాలయంలో బోనకల్, మధిర రూరల్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సమావేశం నిర్వహించిన ఆయన, ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట కోతల అనంతరం మిగిలిపోయే అవశేషాలను రైతులు కాల్చడం వల్ల మంటలు సమీప పొలాలకు వ్యాపించి భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.అలాగే విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదంతో పాటు పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను దహనం చేయడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. దీని ప్రభావంతో ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు అధికమయ్యే అవకాశం ఉందన్నారు.దహనం కారణంగా నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని సీఐ మధు వివరించారు. దీంతో రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో సాగు ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.రైతులు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్‌తో నేలలో కలపడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారీ, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు.

# రాజకీయ వేడి

కాంగ్రెస్‌కు 10 డివిజన్లు, సీపీఎంకు 2, స్వతంత్రులకు 2, బీజేపీకి 1 డివిజన్ లభించాయి. అనంతరం పునుకొల్లు నీరజ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఖమ్మం కార్పొరేషన్‌లోనూ భారీ రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా, మేయర్, డిప్యూటీ మేయర్ సైతం కాంగ్రెస్ వైపు వెళ్లడం కీలక పరిణామంగా మారింది. దీంతో కార్పొరేషన్‌లో కాంగ్రెస్ బలం పెరిగి పాలన పూర్తిగా అధికార పార్టీ ఆధ్వర్యంలో కొనసాగింది.ఇక ఎన్నికలపై స్పష్టత లేకపోయినా, అన్ని ప్రధాన పార్టీలు ఇప్పటికే వ్యూహరచన ప్రారంభించాయి. కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకెళ్లాలని భావిస్తుండగా, బీఆర్ఎస్ మళ్లీ నగరంలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. బీజేపీ కూడా నగర ఓటర్లలో ప్రభావం పెంచుకునే దిశగా కార్యాచరణ రూపొందిస్తోంది. వామపక్షాలు స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.గత ఐదేళ్లలో ఖమ్మం నగరంలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు జరిగాయి. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, సెంట్రల్ లైటింగ్, గోళ్లపాడు చానల్ అభివృద్ధి వంటి పనులకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అదనంగా కొత్త బస్టాండ్, ఐటీ హబ్, సమీకృత మార్కెట్లు, తీగల వంతెన, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వంటి ప్రాజెక్టులు నగర రూపురేఖలను మార్చే దిశగా సాగుతున్నాయి. ఈ అభివృద్ధినే ప్రధాన ఎన్నికల ఆయుధంగా అధికార పార్టీ ఉపయోగించే అవకాశముంది.మరోవైపు డివిజన్ల పునర్విభజన అంశం కూడా రాజకీయంగా కీలకంగా మారింది. ప్రస్తుతం 60 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌ను 65 డివిజన్లకు పెంచే అవకాశాలపై చర్చ జరుగుతోంది. ఓటర్ల సంఖ్య పెరగడం, కొత్త ప్రాంతాల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇదే ఎన్నికల షెడ్యూల్ ఆలస్యానికి కారణమవుతుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ వరంగల్‌తో పాటు ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఎన్నికలు వెంటనే జరుగుతాయా? లేక మరికొంత సమయం పడుతుందా? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. అప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.ఇప్పటికే మాజీ కార్పొరేటర్లు, టికెట్ ఆశావహులు తమ తమ డివిజన్లలో ప్రజలతో మమేకమవుతూ రాజకీయ కార్యకలాపాలు వేగవంతం చేస్తున్నారు. నగరంలో త్వరలోనే మున్సిపల్ ఎన్నికల హీట్ మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



## పామాయిల్ రైతుకు భారీ నష్టం.

### -తక్షణ సాయం అందించాలి - భూక్యా వీరభద్రం

**టీ మీడియా ,మే7 ,కొణిజర్ల :**మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైన పామాయిల్ తోటను సీపీఎం నాయకుల బృందం గురువారం పరిశీలించింది. రైతు ధరావత్ నంధ్యా నాయక్ ఐదు ఎకరాల్లో సాగు చేస్తున్న పామాయిల్ తోటలో మంటలు చెలరేగి, సుమారు రెండు ఎకరాల మేర చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనతో రైతుకు భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.విషయం తెలుసుకున్న సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు ఇతర నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో తోటను పరిశీలించారు. రైతు నంధ్యా నాయక్‌ను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. కష్టపడి పెంచిన తోట కళ్ళముందే బూడిదవ్వడం బాధాకరమని, నష్టపోయిన రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి రైతుకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. అనంతరం ఆయన అక్కడి నుండే ఉద్యాన శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి, రైతుకు జరిగిన నష్టాన్ని వివరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బానోతు హరిచంద్, చింతపల్లి ప్రసాద్, దుగ్గినేని అజయ్ కుమార్, షేక్ మహబూబ్ అలీ, తేజావత్ కృష్ణకాంత్, ధరావత్ నరసింహారావు, ధరావత్ ధనమూర్తి, చంటి తదితరులు పాల్గొన్నారు.




## తనికెళ్లలో

## ఐపీఎల్ బెట్టింగ్ కలకలం.

### -ప్రధాన నిర్వాహకుడు అరెస్ట్

**టీ మీడియా, మే 7 ,కొణిజర్ల :**ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో సాగుతున్న అక్రమ బెట్టింగ్ వ్యాపారంపై కొణిజర్ల పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో అక్రమంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వైరా ఏసీపీ సారంగపాణి వెల్లడించారు.ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. తనికెళ్ల గ్రామంలోని 'అమ్మ టిఫిన్ సెంటర్' వద్ద ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ జరుగుతోందని పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు కొణిజర్ల ఎస్సై సూరజ్ తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ప్రధాన నిర్వాహకుడు గుగులోత్ వెంకటేష్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడగా, మిగిలిన నిందితులు అక్కడి నుండి తప్పించుకున్నారు.నిందితుడి వద్ద నుండి రూ.3,000 నగదుతో పాటు బెట్టింగ్‌కు సంబంధించిన 8 రాత పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు మొబైల్ ఫోన్ కాల్స్ ద్వారా ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈ దందాను నడుపుతున్నట్లు తేలింది. మ్యాచ్‌లు ముగిసిన తర్వాత కమిషన్లు తీసుకుంటూ విజేతలకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ ఘటనపై కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 103/2026 కింద, తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 3 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, బెట్టింగ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.